# కర్నూలు । నంద్యాల

# వార్త

27 ఆగస్టు 2025 | బుధవారం | పేజీలు 4


## కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో 6.74 కోట్ల సిటీ స్కాన్ ప్రారంభం

**: ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్తాం మంత్రి టి.జి. భరత్**



**కర్నూల్ హాస్పిటల్ , ఆగస్టు 26,ప్రభాతవార్త :** కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నానని పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆసుపత్రిలో 6.74 కోట్ల రూపాయల విలువైన 128 స్లైస్ డబుల్ సిటీ స్కానింగ్ యంత్రాన్ని మంత్రి టి.జి. భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి కలిసి ప్రారంభించారు.పవర్ గ్రిడ్ కార్పొరేషన్ వారి దిళీళి నిధుల ద్వారా ఏర్పాటు చేసిన ఈ సిటీ స్కానింగ్ యంత్రం హైదరాబాద్, ముంబై వంటి మహానగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండే అధునాతన సాంకేతిక పరికరమని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులకి ఆక్సిజన్ సరఫరా ధరపై తాను అభ్యంతరం వ్యక్తం చేసినట్లు, కర్నూలు ఆసుపత్రికి కూడా తక్కువ ధరకు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రజల కోసం ఈ పరికరాన్ని అందించిన పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ, ఈ సిటీ స్కాన్ యంత్రం వల్ల రాష్ట్రంలోని ఏడు జిల్లాల ప్రజలకు లాభం చేకూరుతుందని తెలిపారు. సాధారణంగా అరగంట సమయం పట్టే సీటీ స్కాన్ పరీక్ష, ఈ యంత్రం ద్వారా కేవలం ఐదు నిమిషాల్లో అధిక నాణ్యతతో పూర్తవుతుందని వివరించారు. దక్షిణ భారతదేశంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి యంత్రం కర్నూలులోనే తొలిసారి అందుబాటులోకి రావడం గర్వకారణమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ డీజీఎం శ్రీనివాసమూర్తి, పి.ఆర్.ఓ శ్రీకాంత్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

## మదర్ థెరిసా సేవలు మరివలేనివి

**–మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్**



**కర్నూలు విద్య, ఆగస్టు 26, ప్రభాతవార్తః** ఎక్కడో పుట్టి భారతదేశానికి వచ్చి దేశ ప్రజలకు మదర్‌థెరిసా చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. మదర్‌థెరిసా 116 జయంతిని పురస్కరించుకొని ఈరోజు స్థానిక ప్రకాష్‌నగర్‌లోని మదర్‌థెరిసా విగ్రహానికి టీజీ వెంకటేష్ పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.ఈ సందర్భంగా మదర్‌థెరిసా పుట్టినరోజును పురస్కరించుకొని ఏర్పాటు చేసిన బర్త్‌డే కేక్‌ను రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ కట్‌చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతో ఎక్కడో విదేశాల్లోపుట్టి మనదేశానికి వచ్చి పేద ప్రజలకు మదర్‌థెరిసా చేసిన సేవలు అందరికి ఆదర్శప్రాయమన్నారు. మదర్‌థెరిసా స్ఫూర్తితో గత 20 సంవత్సరాలుగా అభయగిరిలో ఉన్న హెచ్‌ఐవి, ఎయిడ్స్ వ్యాధి గ్రస్థుల ఆరోగ్యం కొరకు సేవలు చేస్తుండడం అభినందనీమన్నారు. అభయగిరిలో సేవా కార్యక్రమాల నిమిత్తం తమ వంతుగా సహాయ సహకారాలు అందజేస్తున్నట్లు టీజీ వెంకటేష్ తెలిపారు. శ్రీలక్ష్మి విద్యాసంస్థల డైరెక్టర్ దీక్షిత్, సరేంద్ర, డ్యాన్సర్ రామకృష్ణ, అభయగిరి నిర్వాహకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మహా గణపతిం.. మనసా స్మరామి..!



- ఘన సేవలందుకో.. గణనాథా..
- నేటి నుంచి గణపతి ఉత్సవాలు..
- మట్టి విగ్రహాలతోనే వినాయక చవితికి సార్థకత..
- తొలిపూజకు వేళాయె..
- సర్వకార్వేశుడు.. వినాయకుడు..
- నేడు వినాయక చవితి..



"గజ ముఖం.. ఏక దంతం.. లంబోదరం.. ఇదీ ఆదిదేవుడి భౌతిక రూపం.. తరచి చూస్తే ఆ 'రూపం' నిజంగా అపురూపం..హిందువులు జరుపుకునే అతి ముఖ్యమైన పండుగల్లో వినాయక చవితి ఒకటి.. ఆది దంపతులు పార్వతీ, పరమేశ్వరులకుమారుడు వినాయకుని పుట్టిన రోజును భాద్రపద మాసం శుక్ల చతుర్థి రోజున వినాయక చవితిగా జరుపు కుంటారు.. భారతదేశానికి స్వాతంత్ర్యం రాక మునుపు బ్రిటీష్ ప్రభుత్వం హిందూ సమావేశాలను నిషేధించినందున భారత స్వాతంత్ర్యసమరయోధులు లోకమాన్య బాలగంగాధర్ తిలక్ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా ప్రారంభించిన గణేశ్ ఉత్సవాలు ఏటేటా సమరోత్సహంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది"..

**కోసిగి, ఆగస్టు 26, ప్రభాతవార్త** 'వక్రతుండ మహాకాయ కోటి సూర్య సమాప్రభ.. నిర్విగ్నం కుర్మే దేవ సర్వ కార్యేశు సర్వదా' అంటూ గణపతి దేవున్ని మంత్రంతోపూజించి ప్రతి పనిని మొదలు పెడుతాం.. మాకు ఎలాంటి విఘ్నాలు కలుగకుండా చూడవయ్య అంటూ భక్తికోటి వినాయకచవితి రోజు వేడుకుంటారు.. అలాంటి వినాయక చవితి పర్వదినాన్ని బుధవారం జిల్లా ప్రజలు జరుపుకోనున్నారు..

**విఘ్నేశ్వరుడి విశిష్టతత్వం:**

ఏనుగు ముఖం.. ఏక దంతం, విశాలమైన నుదురు.. నాలుగు చేతులు.. పెద్దపొట్టతో ఉండే స్వామి గణపతి నాలుగుచేతుల్లో పై కుడిచేతుల్లో అంకుశం, ఎడమ చేతిలో చిన్న గొడ్డలి, దిగువ ఎడమ చేతిలో తామరపువ్వు, దిగువ కుడి చేతిలో భక్తులను ఆశీర్వదిస్తున్న స్థితి ఉంటుంది.. ఇలాంటి విశిష్టతత్వం కలిగిన వాడు వినాయకుడు.. వినాయకుడిని ఏకదంతుడు పేరు మొదటగానే ఉంది.. చాలా పురాతన విగ్రహాలలో కూడా వినాయకుడు తన విరిగిన దంతాన్ని చేత పట్టుకునిఉన్నట్లుగా ఉంటారు..పురాణాల ప్రకారం గణనాధుడు ఏకదంత అవతారం ఒక్కటిగా చెప్పబడుతుంది.. మరో రూపంలో స్వామి భూత భవిష్యత్తు, వర్థమాన కాలాలకు చెందిన సకల జగత్తు తన ఉదారంలో ఉన్నట్లు లంబోదరుడు అని పేరు వచ్చిందని బ్రహ్మాండ పురాణాల్లో ఉంది..గణనాథుడు యజ్ఞోపవీతధారణ చేసుకుని ఉదరం, కాళ్లు, చేతులు భాగాల్లో అలంకరించినట్లుగా ఉంటుంది.. పరమేశ్వరుడు గణాధిపతిగా బాధ్యతలు అప్పగించి నప్పటికీ పాములను అలంకరించినట్లుగా పురాణాల ద్వారా తెలుస్తోంది. గణేష్ పురాణం ప్రకారం వినాయకుడి తలమీద తిలక చిహ్నం కనిపిస్తాయి.. చంద్రవంక కూడా అగుపిస్తోంది.. చాలా రూపాల్లో వివిధ వర్ణాలలో వినాయకున్ని అలంకరించబడి ఉంటారు..

**వినాయకుడి రూప రహస్యం:**

వినాయకుడి రూపాన్ని సాధారణంగా చిత్రికరించవచ్చు..

• వివరాలు 2లో

## ఉమ్మడి జిల్లా..ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

**: మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్ రెడ్డి, ఎన్ ఎం డి ఫరూక్ జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటీ్ల నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా**



**కర్నూలు, ఆగస్టు 26, ప్రభాతవార్త :** వినాయక చవితి పండుగ సందర్భంగా ఉమ్మడి జిల్లా ప్రజలకు మంత్రులు టీజీ భరత్ బీసీ జనార్ధన్ రెడ్డి ఎన్ ఏం డి ఫారూఖ్ జిల్లా కలెక్టర్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. గణనాథుని కృపతో జిల్లా అభివృద్ధితో పాటు ప్రజలంతా సంతోషంగా ఉండాలని, వినాయకుడి ఆశీస్సులతో ప్రజలకు మంచి జరగాలని, చేపట్టే ప్రతి పనిలో విజయం చేకూరాలని వారు ఆకాంక్షించారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్రాభివృద్ధి తో పాటు ప్రజలందరి జీవితాల్లో శాంతి, ఐశ్వర్యం, ఆనందం నిండాలని కోరుకుంటున్నానన్నారు. గణనాథుడి దయతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలన్నారు.. పర్యావరణహిత గణేష్ విగ్రహాలను ప్రతిష్టించి, పండుగను సంతోషంగా, ఆనందంగా జరుపుకోవాలని మంత్రులు, అధికారులు ఆకాక్షించారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, మట్టి వినాయకుని విగ్రహాలతో పూజలు జరుపుకుని, సంతోషంతో పండుగ చేసుకోవాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు..

## జిల్లాలో పరిశ్రమల స్థాపనకు చక్కని అవకాశాలు

**– సులభతర ప్రభుత్వ అనుమతులకు త్వరితగతిన చర్యలు**

**– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల టెక్కె, 26 ఆగస్టు, ప్రభాతవార్త:** జిల్లాలో పరిశ్రమల స్థాపనకు చక్కని అవకాశాలతో పాటు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేయడం జరుగుతోందని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై యువ పారిశ్రామికవేత్తలకు, పారిశ్రామికవేత్తలకు అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు చేయూతను ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం యువ పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటుందన్నారు. పరిశ్రమల స్థాపనకు అవసరమయ్యే పెట్టుబడి సాయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం నుండి అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం వైపు నుండి కూడా సులభతరంగా పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో అధికశాతం హార్టికల్చర్, పసుపు, సుగంధ ద్రవ్యాలు, పూలు, పండ్ల మొక్కల పెంపకం ఎక్కువ శాతం చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో సుమారుగా 33శాతం అటవీ ప్రాంతం ఉండగా 1/3వంతు సాగు భూమి ఉందని, అందులో ఎక్కువ శాతం వరి, జొన్న, తదితర పంటలను పెద్దఎతున్న సాగుచేస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నంద్యాల సోనా బియాన్ని సరఫరా చేయడం జరుగుతోందని పశుసంపద కూడా జిల్లాలో సమృద్ధిగా ఉందన్నారు. జిల్లాలోని బనగానపల్లె, డోన్ ప్రాంతాల్లో 90శాతం సున్నపురాయి పరిశ్రమలతోపాటు 10శాతం ఇనుప ఖనిజం, లవణాలు ఉండడం వల్ల మైనింగ్ కార్యకలాపాల నిర్వహణకు పెద్దఎతున్న అవకాశాలు ఉంటాయన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు గాను రాష్ట్ర ప్రభుత్వం వైపు నుండి పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందించే అవకాశం ఉండడంతో పాటు బ్యాంకర్స్ వైపు నుండి కూడా పూర్తి సహకారం అందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం ఎస్.మహబూబు బాషా, డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ బషీరున్నీసా బేగం, కాలుష్య నియంత్రణ సంస్థ ఈఈ కిశోర్‌రెడ్డి, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## అంతర్ రాష్ట్ర దారి దోపిడి.. దొంగల ముఠా అరెస్టు

**- రూ.10.85లక్షలు విలువ చేసే ఆభరణాలు, నగదు స్వాధీనం**



**నంద్యాల టెక్కె, 26 ఆగస్టు, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా పాణ్యం మండలం పిన్నాపురం సమీపంలో కొండల వద్ద అంతర్ రాష్ట్ర దారి దోపిడి దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. అంతర్ రాష్ట్ర దారి దోపిడిలకు పాల్పడుతున్న చెంచు దాసరి అంకన్న, బాపట్ల సత్య హరిశ్చంద్రుడు, బాపట్ల చిన్న హుస్సేని, చెంచు దాసరి జమ్ములు పిన్నాపురం సమీపంలోని కొండలలోని దుర్గం వాగులో ఉన్న వాటర్‌ఫాల్స్ సమీపంలో గుడారం వేసుకుని ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు చాకచక్యంగా పట్టుకోవడం జరిగిందన్నారు. వీరి వద్ద నుండి రూ.10.85లక్షలు విలువ చేసే 11తులాల బంగారు, 21తులాల వెండి, రూ.10వేల నగదు, రెండు మోటారు సైకిళ్లు, 4పిడిబాకులు,2కత్తులను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. 2016సం॥ నుండి నంద్యాల, కర్నూలు, ప్రకాశం, సత్యసాయి, అన్నమయ్య, గుంటూరు జిల్లాల్లోని వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో దొంగతనాలు, దోపిడిలకు పాల్పడుతూ ఉండేవారని తెలిపారు. జల్సాలకు అలవాటుపడిన ముద్దాయిలు రాత్రి సమయాల్లో పాణ్యం, నంద్యాల చుట్టుపక్కల గ్రామాల పరిధిలోని రోడ్డు పక్కన కాపలా కాస్తూ దారిదోపిడిలు, తాళాలు వేసిన ఇళ్లల్లో దొంగతనాలు చేస్తూ వచ్చిన సొమ్మును పంచుకునేవారన్నారు. అంతర్ రాష్ట్ర దారి దోపిడి దొంగల ముఠాను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన సిబ్బందిని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్.యుగంధర్‌బాబు, నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ మంద జావళి ఆల్ఫోన్స్‌లు అభినందించి నగదు రివార్డును అందజేశారు. ఈసమావేశంలో పాణ్యం ఇన్స్‌పెక్టర్ వి.కిరణ్‌కుమార్‌రెడ్డి, సబ్ ఇన్స్‌పెక్టర్ టి.నరేంద్రకుమార్ రెడ్డి పాల్గొన్నారు.



## మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తి దగ్గర.. నాటు తుపాకీ స్వాదీనం..!?

**: ఆత్మకూరు వన్యప్రాని అటవీ డివిజన్‌లో ఏమి జరుగుతుంది**

**: రహస్యంగా కేసు నమోదు చేస్తున్న అటవీశాఖ అధికారులు**

**: వన్యప్రానులను వేటాడేందుకు వెళ్లిన స్మగ్లర్లను అటవీశాఖ అధికారులు పట్టుకునేనా..?**





**ఆత్మకూరు,ఆగష్టు26,ప్రభాతవార్త:** మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి ఆత్మకూరు వన్యప్రాని అటవీ డివిజన్ పరిధిలోని సిద్దాపురం గ్రామానికి చెందిన కొందరు స్మగ్లర్లతో గత రాత్రి వేటకు వెళిన విషయం అటవీశాఖ అధికారులకు తెలిసిన వెంటనే సిబ్బంది అప్రమత్తమై నాటు తుపాకీతో పాటు ఆ వ్యక్తిని స్వాదీనం పరిచి కేసు నమోదు చేసిన్నట్లు సమాచారం. సిద్దాపురం గ్రామానికి చెందిన కొందరు స్మగ్లర్లు పరారిలో ఉండడంతో వారి ఆచూకి కోసం అటవీశాఖ అధికారులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టిన్నట్లు విశ్వసీన నీయమైన సమాచారం. నల్లమల అటవీ ప్రాంతంలో పెద్దపులికి పోంచి ఉన్న ప్రమాదంగా మారిందని వన్యప్రాని ప్రేమికులు ఆశాఖ ఉన్నతాధికారులపై అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాటు తుపాకులతో అడవిలోకి ప్రవేశించి వన్యప్రానులను వేటాడుతున్న వేటగాళ్లపై ఇది వరకే మనం ఎన్నో విషయాలు తెలుసుకున్నాము. ప్రస్తుతం వన్యప్రానుల యాక్ట్ 1972 ఆత్మకూరు వన్యప్రాని అటవీ డివిజన్‌లో కట్టుదిట్టంగా అమలు చేశారు. అయితే స్మగ్లర్లు తమకు అనుకూలంగా ఉన్న ఆవాసాలను ఎంచుకోని ఏదో ఒక రూపంలో వేటకు వెళ్తున్నారని అడవి గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏదిఏమైనప్పటికి నల్లమల అటవీ ప్రాంతంలోని ఆత్మకూరు వన్యప్రాని అటవీ డివిజన్ పరిధిలో రేంజర్ల కొరత వేదిస్తున్నప్పటికి ఉన్నతాధికారులు పెద్దపులి పై చిన్నచూపు చూడడం మూడు రేంజ్‌లకు కలిపి ఒకే రేంజర్‌కు బాధ్యతలు అప్పగించడం ఖాళీగా ఉన్న రేంజ్‌ల స్థానాలలో కొత్త రేంజ్‌లకు అవకాశం కల్పించక పోవడం ఇలాంటి లోపాలతో స్మగ్లర్లు మరోసారి నాటు తుపాకులతో అటవీశాఖ అధికారులకు పట్టుపడడంపై ఉన్నతాధికారులు ఉలికి పాటుకు గురైయారు. ఈ విషయం బయటికి రాకుండా రహస్యంగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయమైన సమాచారం.


## ముగిసిన కానిస్టేబుళ్ల.. సర్టిఫికెట్స్ వెరిఫికేషన్





**కర్నూలు, ఆగస్టు 26, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ వారి ఆధ్వర్యంలో కానిస్టేబుల్ ఉద్యోగానికి జరిగిన వివిధ పరీక్షల యందు ఉత్తీర్ణత పొంది కానిస్టేబుల్ ఉద్యోగాలను (సివిల్ మరియు ఏపీఎస్పీ) సాధించిన అభ్యర్థులందరికీ జిల్లా పోలీస్ పెరేడ్ మైదానంలో సోమవారం సివిల్ కానిస్టేబుల్ అభ్యర్థులకు, మంగళవారం ఏపీఎస్పీ కానిస్టేబుల్ అభ్యర్థులకు సజావుగా సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ప్రక్రియ ముగిసిందని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. కానిస్టేబుల్ ఉద్యోగాల వెరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామన్నారు. అభ్యర్థులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలన్నింటినీ డిపిఓ సిబ్బంది సమగ్రంగా పరిశీలించారన్నారు.ఈ వెరిఫికేషన్ ప్రక్రియ కోసం జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో మొత్తం 12 కౌంటర్లు ఏర్పాటు చేశారన్నారు. అభ్యర్థుల విద్యార్హతలు, క్రీడా సర్టిఫికేట్లు, కేటగిరీకి సంబంధించిన ధ్రువపత్రాలు సహా అన్ని అవసరమైన పత్రాలను సక్రమంగా పరిశీలించారన్నారు. సివిల్ , ఏపీఎస్పీ విభాగాలకు ఎంపికైన మొత్తం 643 మంది అభ్యర్థులు వెరిఫికేషన్ ప్రక్రియకు హాజరవ్వాల్సి ఉండగా 617 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 26 మంది అభ్యర్థులు ఈ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కు హాజరు కాలేదు. సివిల్ కానిస్టేబుల్స్ 309 మంది గానూ మొత్తం 298 హజరయ్యారు. ఏపీ ఎస్పీ 334 మందికి గానూ 319 మంది అభ్యర్థులు హాజరు అయ్యారు. ఈ ధృవీకరణ పత్రాల పరిశీన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్ లు , డీపీఓ ఏ ఓ విజయలక్ష్మి,ఆర్ ఐ లు జావేద్, సోమశేఖర్ నాయక్ , డిపిఓ సూపరింటెండ్ లు, డిపిఓ సిబ్బంది పాల్గోన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలను అకస్మిక తనిఖీ చేసిన ఎంపీ బైరెడ్డి శబరి



**నంద్యాల హాస్పటల్ 26, ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు లోకసభ టిడిపి డిప్యూటి ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి ఆకస్మిక తనిఖీ చేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అర్హులైన దివ్యాంగులందరిక సదరన్ క్యాంపుల ద్వారా మెడికల్ సర్టిఫికెట్ ఇచ్చి నెలకు రూ.6వేలు పెన్సన్ అంధిస్తున్నారని, కొందరు ఈఎన్‌టీ వైద్యుల అలసత్వం వల్ల సదరన్ క్యాంపుకు వచ్చిన దివ్యాంగులను ఇబ్బందులు పెడుతున్నారని, ఇలా చేస్తే ముఖ్యమంత్రి లక్ష్యం ఎలా నెరవేరుతుందని ఆమె మండిపడ్డారు. కావున సదరన్ క్యాంపుల్లో దివ్యాంగులను ఇబ్బంది పెట్టవద్దని ఆమె తెలిపారు. సదరన్ క్యాంపుకు వచ్చే వికలాంగులను ఎందుకు తిప్పుకుంటున్నారని, స్లాబ్ బుక్ చేసుకొని ఆతేదీన వస్తే ఎందుకు పరీక్షలు చేయడం లేదని, కడప రిమ్స్ ఆస్పత్రికి ఎందుకు రెఫర్ చేస్తున్నారని ఎంపి ప్రశ్నించారు. ఈఎన్‌టీ విభాగంలో అవసరమైన ఆధునిక ఆడియో పరికరాలుకుఎంపి నిధులు కేటాయిస్తానని వారిని ఇబ్బంది పెట్టవద్దని, ఇది కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యేలకు ఎంపీ సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్.మదన్‌మోహన్, ఆర్.ఎం.ఓ. డాక్టర్. వెంకటకృష్ణ, ఈఎన్‌టి అసిస్టెంట ప్రొఫెసర్ డా.జైబాకౌసల్, డా.సొహెల్, సెంట్రల్ ఫుడ్ కార్పోరేషన్ డైరెక్టర్ నరహారి విశ్వనాథ్‌రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.కాకరవాడ చిన్నవెంకటస్వామి, రైల్వే జోనల్ వినియోగదారుల మెంబర్ ఎ.వెంకటరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ భవనాన్ని పాఠశాలకు ఇప్పించండి..!

**: కోర్టు ఆదేశాలు వచ్చిన పట్టించుకోని అధికారులు**

**హొళగుంద, ఆగస్టు 26, ప్రభాతవార్త :**



మండల పరిధిలోని కోగిల తోట గ్రామంలో గత ప్రభుత్వంలో పాఠశాల ఆవరణంలో సచివాలయ భవనాన్ని ఏర్పాటు చేశారు. అయితే అప్పుడు ఉన్న ప్రధాన ఉపాధ్యాయులు ఎంఈఓ కు ఫిర్యాదు చేశారు ఎంఈఓ ఎంపీడీవోలు కలిసి విచారణ కోసం గ్రామానికి వెళ్లి పరిశీలించగా అది పాఠశాల ఆవరణంలో సచివాలయాన్ని కట్టారన్నారు. సచివాలయాన్ని కట్టిన కాంట్రాక్టర్లను కలిసి మాట్లాడగా తమకు బిల్లులు అందలేదని బిల్లులు అందిన వెంటనే అప్పగిస్తామని తెలిపారన్నారు. అయితే 2021న కోర్టు ఆదేశాలు సచివాలయ భవనాన్ని పాఠశాల అప్పగించాలని ఆదేశాలు నాలుగు సంవత్సరాలు అయినా కూడా పాఠశాలకు సచివాలయ భావనాన్ని అప్పగించలేదని ఎందుకు ఇంత నిర్లక్ష్యం చేస్తారని అధికారులకు గ్రామస్థులు ప్రశ్నించగా అధికారులు కాలయాపన చేస్తూ సమయం వృధా చేస్తున్నారన్నారు. పాఠశాలలో 451 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారన్నారు. విద్యార్థులకు భవనాలు లేక పాఠశాల ఆవరణంలో ఒకటో తరగతి రెండో తరగతి 60 విద్యార్థులు పాఠశాల ఆవరణంలో విద్యాభ్యాసం చేస్తున్నారన్నారు కోర్టు ఆదేశాలు ఇచ్చిన ఎందుకు అధికారులు అప్పగించడం లేదని గ్రామస్తులు ప్రశ్నించారు. గత సంవత్సరం నుండి అధికారులు చుట్టూ తిరిగిన ఫలితం లేకపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సచివాలయాన్ని పాఠశాల అప్పగించాలని గ్రామస్తులు కోరారు. ఈ విషయంపై ఇంచార్జ్ ఎంపీడీవో చక్రవర్తి వివరణ కోరగా గ్రామానికి వెళ్లి విచారణ చేసి సచివాల భానాన్ని పాఠశాలకు అప్పగించే ల చర్యలు చేపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెదపా మండల కన్వీనర్ వీరన్న గౌడ్ విద్యా కమిటీ చైర్మన్ బసవరాజు రంగన్న గోవర్ధన్ వీరాంజనేయులు దేవన్న గ్రామస్తులు పాల్గొన్నారు.

# మహా గణపతిం.. మనసా స్మరామి..!

**(మొదటి పేజీ తరువాయి ) :** ఆకులతో.. గీతలు, చుక్కలు ఎలా వేస్తే అలా వినాయకుడి ప్రతి రూపాన్ని సులభంగా చిత్రికరణ సాధ్యమవుతుంది.. అయితే వినాయకుడి రూపంలో ఉండే ఆకారాల గురించి చర్చించుకుంటే..

**పెద్దతల:** అంటే పెద్దగా ఆలోచించు అని..
**చిన్న కళ్లు:** ఏకాగ్రతను సాధించు..
**పెద్ద చెవులు:** ఎక్కువగా వినాలి..
**చిన్ననోరు:** తక్కువగా మాట్లాడాలి అని,
**పొడవైన తొండం:** దీర్ఘకాల ప్రణాళికలు రచించుకోవాలి,
**ఏకదంతం:** ఒకే లక్ష్యం కోసం పనిచేయాలి,
**పెద్ద బొజ్జ:** ఎక్కువ సామర్థ్యాన్ని చూపించాలని,
**అభయహస్తం:** అందరికీ స్నేహశీలివై, సహకారం అందించు,
**ఉండ్రాళ్లు:** సామర్థ్యానికి తగ్గ ఫలితం ఆశించు,
**ఆయుధం:** సమయస్ఫూర్తితో సమస్యలను ఎదుర్కోవాలని,
**ఎలుక వాహనం:** కింది స్థాయి వారితో స్నేహంగా ఉండాలనే ఈ వినాయకుడి ప్రతిరూపం మానవ జీవితాన్ని తెలియజేస్తుంది..

సామాజిక విభేదాలకు అతీతం ఈ వినాయక సంబరం: జాతీయ భావాన్ని పురికొల్పుతూ సామాజిక విభేదాలకు అతీతంగా హిందువులు జరుపుకునే ఉత్సవాల్లో గణేశ్ చతుర్థి ఎంతో ప్రధానమైన పండుగగా నిలిచింది..జాతి జనులను సమగ్రత వైపు నడిపించిన కీర్తి కేవలం గణేశ్ చతుర్థి ఉత్సవాలకే దక్కుతుంది. భారతదేశంలో ఉన్న హిందువులు అనాధిగా మతపరమైన ఎన్నో పండుగలను ఆచరిస్తున్నా, ఏ పండుగకు లేని విశిష్టత ఈ వినాయక చవితి ఉత్సవాల్లో కనిపిస్తుంది..ముఖ్యంగా అగ్రవర్ణాలు, బడుగు వర్గాల మధ్య అంతరాలను తొలగించడంలో కీలక పాత్ర వహిస్తున్నందునే దీన్ని జాతీయ స్థాయిలో భారీ ఉత్సవంగా ఏటా నిర్వహిస్తున్నారు.. ఒకప్పుడు ఇళ్లలో నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలు నేడు పల్లెసీమల నుంచి నగరాల దాకా చూస్తే వీధి..వీధినా, వాడవాడలా కోలాహలం కనిపిస్తుంది..

కేవలం కుటుంబ పరమైన పండుగలా కాకుండా, విభిన్న సామాజిక వర్గాలన్నీ కలసికట్టుగా నిర్వహిస్తున్నందున ఇది జాతీయతకు చిహ్నంగా, సమగ్రతకు వారధిగా గోచరిస్తుందని చెప్పవచ్చు...

**మండపాలు సిద్ధం:** ఈ రోజు వినాయకుడి విగ్రహం ప్రతిష్టించడానికి జిల్లాలో మండపాలు సిద్ధమయ్యాయి..మామిడి, ఉత్తరేణి, జిల్లేడు, కరవీర, టేకు, మారేడు, ములక, రేగు, దూర్వా, తులసీ, మద్ది, దేవదారు తదితర 21 రకాల పత్రాలతో విఘ్న రాజును అర్చించనున్నారు. శనివారం జరిగే పండుగ నేపథ్యంలో శుక్రవారం నుంచే మార్కెట్‌లో వినాయక విగ్రహాలు, పూజా సామాగ్రి మార్కెట్‌ను ముంచెత్తాయి. మండపాల నిర్వహకులు భారీ విగ్రహాలను మండపాల వద్దకు తరలిస్తుండటంతో సందడి నెలకొంది..

# రాయలసీమ ముఖ ద్వారం కర్నూలు సరిహద్దులు చూపించండి..!

**: పూర్వంలాగనే రాయలసీమను రాజధాని పేరు నిలపండి : శ్రీశైలం మా జిల్లాదే మాకే ఉండాలి : మార్కాపురం, గిద్దలూరు, దోర్నాల ప్రాంతాలను నంద్యాల జిల్లాలో కలపాలి : రాజకీయ సీనియర్ విశ్లేషకులు బాణాల మోహన ఆచారి : జిల్లాల విభజనల పేరుతో ప్రజలను ఇబ్బంది పెడుతున్న పాలకవర్గాలు : శ్రీశైలానికి ఒక్కప్పుడు గ్రామ పంచాయతీ ఆత్మకూరు మండలంలోని వెంకటాపురం**

**ఆత్మకూరు, ఆగష్టు26, ప్రభాతవార్త :**



రాయలసీమ ముఖ ద్వారం కర్నూలు జిల్లా ఆంధ్ర, తెలంగాణలకు రాజధానిగా నిలిచిన మొదటి రాయలసీమ కర్నూలు అని నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు మండల పరిధిలోని ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన రాజకీయ సీనియర్ విశ్లేషకులు బాణాల మోహన ఆచారి మంగళవారం విలేకరులతో ప్రత్యేకించి మాట్లాడారు రాష్ట్రాల విభజన తర్వాత ప్రభుత్వాలు, పాలకులు ప్రజలను విభజించి పాలించే విదంగా చరిత్ర ఉన్న రాయలసీమలోని కర్నూలు జిల్లాను యదావిదంగా కొనసాగించే విదంగా కూటమి ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. మార్కాపురం జిల్లా కేంద్రంగా ప్రకటిస్తూ శ్రీశైలం పుణ్యక్షేత్రాని ఆ ప్రాంతం అంతటిని ఆ జిల్లాలో కలిపే ప్రయత్నంలో ప్రభుత్వం ఉన్నప్పటికి ఆ ఆలోచనను విరమించుకునే విదంగా కూటమి ప్రభుత్వం ముందుండాలని తెలిపారు. 1970 సంవత్సరంలో ప్రకాశం జిల్లా అయిన ఒంగోలును ఏర్పాటు చేసిన్నప్పుడు కర్నూలు జిల్లాలోని మార్కాపురం, గిద్దలూరు, దోర్నాల, కంభం, త్రిపురాంతకం ఆ జిల్లాలో వీలినం చేశారని తెలిపారు. ముందు ప్రభుత్వాలు రాయలసీమ ప్రాంతంలోని కర్నూలు జిల్లా పూర్వం సరిహద్దులు చూపించాలని బాణాల మోహన ఆచారి ప్రభుత్వానికి, అధికారులకు, పాలకులకు డిమాండ్ చేశారు. శ్రీశైలం నియోజకవర్గంలో శ్రీశైలం, మహనంది, బండి ఆత్మకూరు, ఆత్మకూరు, వెలుగోడు మండలాలను నంద్యాల జిల్లాలోనే కొనసాగించి వీటితో పాటు మార్కాపురం, గిద్దలూరు, దోర్నాల, కంభం, త్రిపురాంతకం నియోజకవరా ్గలను కలిపి నంద్యాల జిల్లాను మహనగరంగా రాష్ట్రంలో ప్రకటించే విదంగా కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని బాణాల మోహన ఆచారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

# ఇబ్బదులు లేకుండా యూరియా పంపిణి

**కొత్తపల్లె, ఆగష్టు 26, ప్రభాతవార్తః**



రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యూరియా పంపిణి చేస్తున్నామని తహశీల్దార్ ఉమారాణి తెలిపారు. మంగళవారం ఎదురుపాడు గ్రామంలో కొత్తపల్లె ఎస్ఐ జయశేఖర్, మండల వ్యవసాయ అధికారి అమిరున్నిసా బేగం సమక్షంలో మంగళవారం యూరియా పంపిణి చేశారు. ఈసందర్బంగా తహశీల్దార్ ఉమారాణి మాట్లాడుతూ మండలంలోని రైతు సేవా కేంద్రాలకు 110 మెట్రిక్ టన్నుల యూరియా చేరిందన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా పంపిణి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో విఆర్వో ఆశోక్ కుమార్, గ్రామ ఉద్యానశాఖ సహాయకులు విజయ్, తెదేపా మాజీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# జాతీయ క్రీడా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

**ఆత్మకూరు, ఆగష్టు 26, ప్రభాతవార్త :**




జాతీయ క్రీడా దినోత్సవంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఆత్మకూరు స్పోర్ట్స్‌క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా అన్నారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ ఈనెల 29న మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినం పురష్కరించుకొని శ్రీశైలం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి సహకారంతో ఆత్మకూరు కేవికే స్టేడియం ఇంచార్జీ జునైద్‌బాష ఆద్వర్యంలో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జాతీయ క్రీడా దినోత్సవం భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ గౌరవ సూచకంగా జరుపుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు తైక్వాండో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నాయబ్ సయ్యద్ అసదుల్లా, అధ్యక్షులు ఖాజా హుసేన్, ఖోఖో శిక్షకులు మహెబుబ్, బ్యాట్మింటన్ శిక్షకలు హరి యాదవ్ పాల్గొన్నారు.

# తుగ్గలిలో రైతులకు యూరియా పంపిణి

**తుగ్గలి, ఆగష్టు 26, ప్రభాతవార్త :**



మండల కేంద్రంమైన తుగ్గలిలోని రైతు సేవా కేంద్రంలో యూరియా మరియు నానో యూరియన్ రైతులకు తహసిల్దార్ రవి, మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు, ఎస్సై బాలనరసింహులు పంపిణి చేశారు. తహసిల్దార్ మాట్లాడుతు యూరియా అవసరమైన మేరకు వాడాలని ముందే తీసుకొవాలసిన అవసరం లేదని స్టాక్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. నానో యూరియాను ప్రతి రైతు వాడాలన్నారు. నానో యూరియా శాస్త్రజ్ఞుల పరిశోధన ప్రకారం మంచి ఫలితాలు వస్తాయని, ఒక బస్తా యూరియా బదులు నానో యూరియా బాటిల్ ఎకరాకు సరిపోతుందని ఎస్సై తెలిపారు. ఏవో మాట్లాడుతు ఇప్పటి వరకు 200 టన్నుల యూరియా మండలానికి రావడం జరిగిందని, ఇంకా ఆర్ఎస్కె నుంచి ఇండెంట్ పెట్టడం జరిగిందన్నారు. అలలాగే వర్షపు నీళ్ళు పోయిన తరువాత తప్పని సరిగా యాజమాన్య పద్దతులుపాటించాలని తెలిపారు. ప్రతి ఒక్కరు పంట నమోదు చేసుకోవాలని ఇప్పటి వరకు 22 వేల ఎకరాల్లో పంట నమోదు జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో పటేల్, నారాయణ, బాలసరస్వతి, సూర్యప్రకాశ్‌రెడ్డి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ నందు సీట్ సాధించిన లక్ష్మీప్రణతి

**తుగ్గలి, ఆగష్టు 26, ప్రభాతవార్త :**



మండలంలోని జొన్నగిరి గ్రామానికి చెందిన ఎం.లోకానాథ్, ఎం.జయ లక్ష్మి దంపతుల కుమార్తె లక్ష్మిప్రణతి నీట్ పరీక్షలలో ప్రతిభ చాటి 1147 స్టేట్ ర్యాంక్ సాధించి విజయవాడలోని సిద్దార్థ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ అడ్మిషన్ పొందింది. తల్లిదండ్రులు ఇద్దరు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. లక్ష్మిప్రణతి మెడిసిన్ సీట్ సాధించడంతో జొన్నగిరి గ్రామస్తులతో పాటు పలువురు అభినంధనలు తెలిపారు.కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో తాను మంచి ఫలితం సాధించానని, భవిషత్తులో డాక్టర్‌గా గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అంధిస్తానని లక్ష్మిప్రణతి తెలిపారు.

# కోనేరులో చేప పిల్లల పెంచితే నీరుశుబ్రంగా ఉంటుంది..

**కోవెలకుంట్ల, అగష్టు 26,ప్రభాతవార్త :**



చెరువుల్లో, అలయాల వద్ద ఉన్న కోనేరుల్లో గంబూసియా చేప పిల్లలను పెంచితే అదాయంతో పాటు నీరు శుబ్రంగా ఉండటముతో పాటు మలేరియా డెంగ్యూ కలిగించే దోమల లార్వాను నిర్మూలిస్తాయని చెప్పారు. జిల్లా మలేరియా అదికారి చంద్రశేఖరరావు అన్నారు. మంగళవారము స్థానిక పాండురంగ స్వామికోనేరులో నంద్యాల మలేరియా అదికారి చంద్రశేఖరరావు చేపపిల్లలనెఉ వదాలారు. ఈసందర్బముగా అయన మాట్లాడుతు కోనేరుల్లో చేపలు ఉండటముతో అందులో ఉన్న నీరు శుబ్రతతోపాటు వాటి వల్ల అదాయము కూడా వస్తుందని చెప్పారు. చేప పిల్లలు పెరిగి పెద్దవి అయిన వెంటనే వాటిని వేలం వేయడముతో అలయానికి అదాయం వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అఫసరు విశ్వనాదు, హెల్త్ సూపరువైజర్లు మునిస్వామిపరమేశ్వరరెడ్డి హెల్త్ అసిసెనంటువీరభద్రెయన్యం సుజాతమరియు అశా వర్కుర్లు పాల్గొన్నారు.

# బావిలో గంబూషియా చేపలను వదిలిన అధికారులు

**రుద్రవరం, ఆగస్టు 26, ప్రభాతవార్త :**



రుద్రవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి ఎస్.శ్రావణి ఆధ్వర్యంలో వెక్టార్ బార్న్ డిసీసెస్ కంట్రోల్‌లో భాగంగా రుద్రవరంలోని మేడవారిబావిలోని నీటిలో మంగళవారం గంబూషియా చేపలను వదిలారు. ఈ చేపలను వదలడం వల్ల బావి నీటిలో ఉన్న లార్వాలను తిని దోమలద్వార వచ్చే మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా, డెంగ్యూ, మెదడువాపు వంటి వ్యాధులు రాకుండ అరికడతాయని శ్రావణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఓ రవీంద్రనాథ్, హెల్త్‌అసిస్టెంట్ నాగరాజు, సిహెచ్‌ఓలు హరిప్రియ, హేమవతి, ఆశలు పాల్గొన్నారు.

# మా గ్రామానికి బస్సు రాలేదు సార్

**: ఎస్ఐ ను కోరిన విద్యార్థులు**

**హొళగుంద, ఆగస్టు 26, ప్రభాతవార్త :**



మండల పరిధిలోని ముద్దటమాగి గ్రామానికి వెళ్లే ఆర్టీసీ బస్సు సాయంత్రం సర్వీసు రాకపోవటం తో విద్యార్థులు స్థానిక పోలీస్ స్టేషన్లో వెళ్లి తమ గ్రామానికి బస్సు రాలేదని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎస్ఐ దిలీప్ కుమార్ ఆర్టీసీ డిఎంకు ఫోన్ చేసి ముద్దట మాగి గ్రామానికి సాయంత్రం పూట వెళ్లే బస్సు పంపాలని కోరారు. అయితే బస్సు కాస్త ఆలస్యంగా ఉందని , రహదారులు సరిగ్గా లేకపోవడంతో బస్సులు తరచూ చెడిపోతున్నాయని,కావున కాస్త ఆలస్యమైన బస్సు వస్తుందని సమాధానమిచ్చారు. అయితే రాత్రి 7 గం.ప్రాంతం దాటిన చివరకు బస్సు రాకపోవటంతో ఎస్ఐ స్పందించి తమ కార్యాలయ జీపు లోనే విద్యార్థులను ఎక్కించి ముద్దటమాగి గ్రామానికి విద్యార్థులను చేర్చారు. దీంతో విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు ఎస్సై కు ధన్యవాదాలు తెలిపారు.

# ఎమ్మార్పీఎస్ సుదీర్ఘ పోరాటంతో వర్గీకరణ ఫలాలు

**ఆత్మకూరు, ఆగష్టు 26, ప్రభాతవార్త :**




30 సంవత్సరాల సుదీర ్ఘ పోరాటం చేసి మాదిగల వర్గీకరణ ఫలాలు అందించడం జరిగిందని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు చిలుక రాబిన్‌సన్‌రాజు, జిల్లా అధికార ప్రతినిధి బాషపోగుల దరగయ్య, మండల ఇంచార్జీ వాదం నాగశేషులు, ప్రధాన కార్యదర్శి మదనపల్లి బుజ్జి, ఇంచార్జీలు జిల్లా ప్రచార కార్యదర్శి కాటేపోగు నాగయ్య, మండల అధ్యక్షులు వనమాల పుల్లయ్య, ఎంఎస్‌పి అధ్యక్షులు తిమ్మరాజు, నానిలు అన్నారు. వెంకటాపురం గ్రామంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా ఇంచార్జీ జాతీయ అద్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు సలహాతో ఎమారీ ్పఎస్ జెండాను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ వర్గీకరణ సాధన కోసం ఎంతో మంది ప్రాణ త్యాగం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమార్పీఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసి బస్టాండ్ టాయిలెట్‌లలో నీళ్లు లేవు

**కొలిమిగుండ్ల, ఆగష్టు 26, ప్రభాతవార్తః**

కొలిమిగుండ్ల మండల కేంద్రంలో ఆర్టీసి బస్టాండ్‌లో గత కొన్నిరోజుల నుండి టాయిట్‌లెట్లకు నీటి సరఫరా నిలిచిపోయినట్లు నిర్వాహకులు నాగమ్మ తెలిపారు. ఈసమస్యను ఆర్టీసి అధికారులు గుర్తించి వెంటనే టాయిలెట్లకు నీరు సరఫరా అయ్యేవిధంగా కృషిచేయాలని లేదా పంచాయితీ అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రయాణికులు నీరు సరఫరా లేకపోవడంతో దుర్వాసతో విసుగు చెందుతున్నారని ఈసందర్బంగా పలువురు ప్రయాణికులు తెలియజేస్తున్నారు. సమస్యను వెంటనే గుర్తించి పరిష్కరించాలని కోరుతున్నారు.

# వ్యాధులపైవిద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

**కొత్తపల్లె, ఆగష్టు 26, ప్రభాతవార్తః**



సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని టిబి సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్ విద్యార్థులకు సూచించారు. ఆయన మంగళవారం మండల కేంద్రం కొత్తపల్లె కెజిబివి ప్రభుత్వ పాఠశాల నందు ప్రాధమి ఆరోగ ్యకేంద్ర ఆధ్వర్యంలో టిబి ముక్త భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 15 రోజులు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, అలసట, ఛాతిలో నొప్పి వంటి లక్షణాలు కనిపించినప్పుడు క్షయవ్యాధిగా అనుమానించి ఆరోగ ్యకేంద్రం నందు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. విద్యార్థులు వా ్యదుల పట్ల గత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పిహెచ్ఎన్ ప్రబావతి మాట్లాడుతూ యోగా,మెడిటేషన్, వ్యాయామం పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వ్యాధుల బారినపడకుండా ఉంటారన్నారు. ఈకార్యక్రమంలోహెల్త్ అసిస్టెంట్ మల్లేశ్వరి, పాఠశాల ఉపాధ్యాయులు రవణమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎరువుల షాపులు తనిఖీలు ముమ్మరం

**పాములపాడు రూరల్, ఆగష్టు 26, ప్రభాతవార్తః**



పాములపాడు మండలంలో తహశీల్దార్ సుభద్రమ్మ, ఏవో మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ సురేష్‌బాబులు ఎరువుల షాపుల తనిఖీలు ముమ్మరం చేశారు. మంగళవారం జూటూరు గ్రామంలో సాయిబాబా అగ్రో ఎజేన్సీ, గాయత్రి సీడ్స్ షాపుల్లోని రికార్డులు పరిశీలించి గోడౌన్‌లోని స్టాక్‌ను పరిశీలించారు. అక్రమంగా ఎరువులు నిల్వ ఉంచితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఎమ్మార్పి ధరలకంటే అధికంగా విక్రయిస్తే కేసులు బనాయిస్తామని హెచ్చరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎమ్మార్పీ ధరలకే ఎరువులను అమ్మాలన్నారు.

# పర్యావరణ హిత ఏకో-ఫ్రెండ్లీ గణేష్ విగ్రహాల పంపిణి

**ఆళ్లగడ్డ, ఆగష్టు 26, ప్రభాతవార్తః**



జిల్లా పోలీస్‌శాఖ ఆద్వర ్యంలో మంగళవారం ఆళ్లగడ్డలోని నాలుగురోడ్ల సర్కిల్‌లో ఆళ్లగడ్డ డిఎస్పీ కె ప్రమోద్ వంద కుటుంబాలకు ఏకో ఫ్రెండ్లీ గణేష్ విగ్రహాలు పంపిణి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను పరా ్యవరణహితంగా జరుపుకోవాలన్నారు. కాలుష్యాన్ని నివారించి సుస్థిరమైన ఉత్సవ సంస్కృతి ఏర్పరచుకోవాలని ఆయన తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణ సిఐ యుగంధర్, ఎస్ఐలు జయప్ప, నగీనా, సిబ్బంది పాల్గొన్నారు.

# వెల్దుర్తిలో ఎరువుల దుకాణాల తనిఖీలు

**యూరియా ఎరువులు ఈ పాస్ మిషన్ ద్వార విక్రయించాలి..**

**వెల్దుర్తి, ఆగష్టు 26, ప్రభాతవార్త :**



వెల్దుర్తి పట్టణంలోని శ్రీనివాస ఆగ్రో ఏజెన్సీస్, శ్రీలక్ష్మీ దత్త వెంకటేశ్వర ఫర్టిలైజర్స్, ధరణి ఫర్టిలైజర్స్, శ్రీసాయిక్రిష్ణ ఫర్టిలైజర్స్ దుకాణాలను మంగళవారం మండల తహశీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, మండల వ్యవసాయాధికారి అక్బర్‌బాష, ఏఎస్సై బాలక్రిష్ణతో కలిసి తనిఖీలు నిర్వహించారు. వారు రికార్డులు పరిశీలించారు. స్టాకుబోర్డులను, లైసెన్స్‌లను, అనుమతిపత్రాలను, గోడౌన్‌లలో ఉన్న ఎరువుల నిల్వలు తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ యూరియా ఎరువులను ఈపాస్ మిషన్ల ద్వారా రైతుల ఆధార్ అనుసంధానంతోనే విక్రయాలు జరపాలన్నారు. ఎరువులను కృత్రిమ కొరత సృష్టించి రైతులకు ఇబ్బందులు పెడితే ఆయా డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అధిక ధరలకు ఎవరైనా విక్రయిస్తే అట్టివారి లైసెన్స్‌లను రద్దు చేస్తామన్నారు. పత్తికొండ ఏడిఏ మోహన్‌విజయ్‌కుమార్, తహశీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, మండల వ్యవసాయాధికారి అక్బర్‌బాష, వెల్దుర్తి ఏఎస్సై బాలక్రిష్ణ పాల్గొన్నారు.

# స్వామిత్వ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలి

**- ఎంపీడివో**

**పాములపాడు రూరల్, ఆగష్టు 26, ప్రభాతవార్త ః**



స్వామిత్వ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడిఓ చంద్రశేఖర్ సచివాలయ సిబ్బందికి సూచించారు. పాములపాడు మండలంలో 6 గ్రామ పంచాతీల్లో పాములపాడు, మిట్టకందాల, చెలిమిల్ల, వానాల, మద్దురు, భానుముక్కల గ్రామాల్లో స్వామిత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడివో తెలిపారు. ఈకార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాములపాడు గ్రామంలో మొత్తం 1921 ఆస్తుల వివరాలు సేకరించి కొలతలు వేయడానికి మూడు ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి టీమ్‌లో పంచాయితీ కార్యదరి ్శ డిటిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, సర్వేరు పాల్గొని ప్రభుత్వ స్థలాలు మరియు ఇంటివారిగా ప్రతి ఇంటిని కొలతలు వేయడం జరుగుతుందని తెలిపారు. సేకరించి వివరాలు అన్‌లైన్‌లో నమోదుచేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటి ఎంపీడివో సులోచన పాల్గొన్నారు.

# ఘనంగా కోడుమూరు మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణస్వీకారోత్సవం

– యార్డులో రైతు బజార్,పశువుల సంతల ఏర్పాటు చేసేందుకు కృషి



**కోడుమూరు, ఆగస్టు 26, ప్రభాతవార్త :** కోడుమూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటైన కమిటీకి ఎంపికైన పాలక వర్గం ప్రమాణస్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ ఎంపిక కార్యక్రమాన్ని కర్నూలు మార్కెట్ యార్డు అధికారి సుందర్‌రాజు అద్యక్షతన ప్రమాణస్వీకారాలు జరిగాయి. ముందుగా కోడుమూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఎంపికైన ఆకేపోగు సుగణమ్మను ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే వైస్‌చైర్మన్‌గా ఎల్లప్పనాయుడును మార్కెట్ యార్డు అధికారులు ప్రమాణస్వీకారం చేయించారు. అదే విధంగా యార్డు కమిటీకి ఎంపికైన డైరెక్టర్లు ఈడిగ భాగ్యమ్మ, దరూర్‌గోపి, పొన్నగంటి శంకర్‌రెడ్డి, పద్మావతి,పుట్టపాశం బాబు, చిన్నఎల్లప్ప, పార్వతి, కావడి వెంకట్రాముడు, అల్లం ఉమాదేవి, ఈరపోగు అక్కిల, సోమసాలే శ్రీనివాసులు, ఈడిగ చరణ్‌కుమార్, మల్లేపోగు చిరంజీవిలకు కూడా ప్రమాణం స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన సమావేశంలో కోడుమూరు టీడీపీ పట్టణ అధ్యక్షులు గంగాధర్ నాయుడు మాట్లాడుతూ తమ నేత జిల్లా కెడిసిసి బ్యాంకు చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిల ప్రొత్సాహంతో నేడు కోడుమూరు మార్కెట్ యార్డు కమిటీకి నామినేటెడ్ పదవులు దక్కాయన్నారు. నేత అండదండలతో దక్కిన ఈ పదవులను కమిటీ పాలక వర్గం అంతా పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటారన్నారు. ఎంతో కాలం నుంచి ఇక్కడ ఉన్న ఈ యార్డు అభివృద్ధిని సాధించలేక పోయిందని, ఆ పరిస్థితి ప్రస్తుత పాలక వర్గంతో యార్డు అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. త్వరలో ఇక్కడ రైతు బజార్ ఏర్పాటు చేయడంతో పాటు, పశువుల సంత కూడా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక టీడీపీ నాయకులు ఆకేపోగు జయ్యన్న, స్థానిక టీడీపీ నాయకులు రామక్రిష్ణ, మాల మునుస్వామి,లింగం బాలక్రిష్ణయ్య, గోరంట్ల మధు, అయ్యప్ప, సురేంద్ర, బలరాము, లద్దగిరి జయ్యన్న, చెరుకులపాడు రాముడు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి సమీపంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు

: బీసీ రాజారెడ్డి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు

**బనగానపల్లె రూరల్, ఆగస్టు 25, ప్రభాతవార్త :**




బనగానపల్లె పట్టణ శివారులోని బేతంచెర్ల రహదారిలో వెలిసిన శ్రీ అయ్యప్ప స్వామి గుడి దగ్గర రూ..4 లక్షల విలువచేసే ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ ప్లాంట్ ను బీసీ రాజారెడ్డి తమ సొంత నిధులతో ఏర్పాటు చేయడం జరిగింది. అయ్యప్ప స్వామి భక్తులకు, పట్టణ ప్రజలకు,ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగింది. ముందుగా బీసీ రాజారెడ్డి పూజ కార్యక్రమం అనంతరం మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. ప్రజల ఆరోగ్య దృశ్య శుద్ధ జలం అందించాలన్న సంకల్పంతోనేమినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ప్లాంట్ కు కరెంట్ బిల్లుతోపాటు నిర్వాహన మొత్తం కూడా తన సొంత నిధులతోనే చేపట్టడం జరుగుతుందన్నారు. మునుముందు ప్రార్థన మందిరాలకు కూలింగ్ మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. ప్రజలు నీటిని వృధా చేయకుండా పొదుపుగా, అవసరమైన మేరకు వాడుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బొబ్బల బాల తిమ్మారెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మోలిశ్వర్ రెడ్డి, వంగల పరమేశ్వర్ రెడ్డి,బొబ్బల రామమద్దిలేటి రెడ్డి, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి మురళి మోహన్ రెడ్డి, బీసీ మదనభూపాల్ రెడ్డి, నుసి విష్ణువర్ధన్ రెడ్డి, సంగు శంకేశ్వర్ రెడ్డి, బత్తుల నారాయణ రెడ్డి,అయ్యప్ప స్వామి సొసైటీ వారు పాల్గొన్నారు.

# విగ్రహాల వద్ద అసభ్య పాటలు అసభ్య నృత్యాలు ఉండరాదు


**కోవెలకుంట్ల, ఆగస్టు 26, ప్రభాతవార్త :**



విగ్రహాల మండపాల వద్ద అసుభ్యకరమైన పాటలు ఇతర నృత్యాలు ఉండరాదని సిఐ హనుమంతునాయక్ చెప్పారు. మండళవారము అయిన విలేకర్లతో మాట్లాడుతూ సర్కిల్ పరిదిలో ఉన్న మూడు పోలీసు స్టేషన్‌ల్లో అన్ని గ్రామాల్లో 190 విగ్రహాలను ఏర్పాటు చేయుటకు దరకాస్తులు అందాయని చెప్పారు.అందులో కోవెలకుంట్ల స్టేషన్ పరదిలో81,సంజామల మండలంలోని 84, రేవనూరు స్టేషన్ పరదిలో 25 విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇచ్చామని చెప్పారు. అయితే విగ్రహం ఏర్పాటు నుండి నిమజ్జనము వరకు అ కమిటిదే బాద్యత ఉంటుందని చెప్పారు. నిబందనలు అతిక్రమించకుండా చూసుకోవాలనిచెప్పారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం విడనాడాలి..

**తుగ్గలి, ఆగస్టు 26, ప్రభాతవార్త :**




ప్రజా సమస్యలను పరిష్కారించడంలో అధికారులు నిర్లక్ష్యాన్ని విడనాడాని ఎంపీపి రాచపాటి రామాంజనమ్మ అధికారులకు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ రామాంజనమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయా శాఖల అధికారులు హాజరై తమ వద్ద ఉన్న ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఏవో సురేష్‌బాబు మాట్లాడుతు ప్రతి రైతు పంట నమోదు తప్పని సరిగా చేసుకోవాలని, మండలంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా ఉందని, ఇప్పటికే మండలానికి 200టన్నుల రావడం జరిగిందని, వివిధ గ్రామాలలో రైతులకు పంపిణి చేశామన్నారు. అధిక వర్షాలకు చెరువుతాండా,చెన్నంపల్లి గ్రామాల పొలాలతో పాటు పలుచోట్ల పంట నష్టం జరిగిందన్నారు. ఇన్‌చార్జ్ ఎంపిడిఓ భాషా మాట్లాడుతు సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు తెలియజేసిన సమస్యలన్నింటిని వచ్చే సర్వసభ్య సమావేశంలోగా పరిష్కారించాలని అధికారులకు తెలిపారు. అలాగే జిల్లా కలెక్టర్ త్వరలో పల్లెకు పోదాం అనే కార్యక్రమం ద్వారా గ్రామాల్లోకి రావడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో ఆకస్మికంగా కలెక్టర్ వస్తారన్నారు. కనుక అన్ని శాఖల అధికారులు, పంచాయితీ కార్యదర్శిలు, ప్రతినిధులతో కలిసి డ్రైనేజ్, త్రాగునీరు సమస్యలను పరిష్కారించి అన్ని విధాలుగా తమ ప్రోగ్రెస్‌ను మెరుగు పరుచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహాసిల్దార్ రవి, ఈవోఆర్డీ శ్రీహారి, పశువైద్యాధికారి బాలకృష్ణ, ట్రాన్స్‌కో ఏఈ, ఆర్‌ఢబ్ల్యూఎస్ ఏఈ నరేష్, ఏపివవో హేమసుందర్,ఏపిఎం రాధాకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ రామ్‌బ్రహ్మం, ఎంపిటీసులు, సర్పంచులు, వివిధశాఖ అధికారులు పాల్గొన్నారు.

# విగ్రహాల మండపాల వద్ద పరిశుభ్రతను పాటించండి..

: ప్లాస్టికు గ్లాసులు, ప్లేట్లు వాడకండి

**కోవెలకుంట్ల, ఆగస్టు 26, ప్రభాతవార్త :**



వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విగ్రహాల మండపాల వద్ద పరిశుబ్రతను పాటించాలని డిప్యుటి మండల పరిషత్ అబివృద్ధి అదికారి ప్రకాశ్‌నాయుడు కోరారు. మంగళవారము అయన తన కార్యాలయం విలేకర్లతో మాట్లాడుతూ వినాయక చవితి పండుగను అందరు ఘనంగా నిర్వహించు కుంటున్నారు. అదే సమయంలో విగ్రమాల వద్ద ఏర్పాటు చేసిన మండల పాల వద్ద పరిశుబ్రతను పాటించాలని కోరారు. ముఖ్యంగా ప్లాస్టికు ప్లేట్లు మరియు గ్లాసులు వాడవద్దని కోరారు.తడిచెత్త పొడిచెత్త వేరు వేరుగా సేకరించిగ్రామ పంచాయితీ ట్రాక్టరులో వేయాలని రోడ్లు మరియు కాలువలల్లో ఎటువంటి చెత్తవేయరాదని చెప్పారు. రాత్రి 9గంటల నుండి మరుసటి రోజు ఉదయం 6గంటల వరకు ఎటువంటి శబ్దాలు చేయరాదు. చిన్నపిల్లలనిమరియు పెద్దవాళ్లని ఇబ్బంది పెట్టరాదని కోరారు. నాణ్యమైన విద్యుత్ వైయర్లు సరఫరా వైయర్లను వాడలని చెప్పారు. విద్యుత్ అలంకరణకు ఉపయోగించుసిరియల్ సెట్లు డేకరేషన్ లైట్లు కట్టుకొనుటకు కర్రలను మాత్రమే ఉపయోగించాలని ఇనుప పైపులు గాని రాడ్లు గాని వాడ రాదని కోరారు. సీరియలన లైట్ల కనెక్షన్ కొరకు గుండు సూదులు వాడరాదు మరియు జాయింటువేసి టేపు కొట్టాలని చెప్పారు. బేనర్లు కట్టునప్పుడు విద్యుత్ వైర్ల దగ్గర తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.లోడుకు తగిన కేపాసిటి వాడనట్లు అయితే షార్ట్‌సర్క్యూట్ జరిగి అగ్నిప్రమాదాలు జరుగుటకు అవకాశము ఉందని చెప్పారు. విద్యత్ ట్రాన్సు ఫర్మర్ వద్ద గణేస్ మండపాలను ఏర్పాటు చేయరాదు. విద్యుత్ పోల్స్‌ను మండపాలకు సపోర్టు కోసం వాడరాదు వినాయక నిమజ్జనము కోసం తీసుకొను వెల్లడప్పుడు విద్యుత్ వయర్ల దగ్గర తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరము అయితే విద్యుత్‌ను అప్ చేయించాలని తెలిపారు వీటిని మండపము ఏర్పాటు చేసిన వారు ఖచ్చితంగా పాటించాలని ప్రకాశ్‌నాయుడు తెలిపారు.

# మందలూరులో రైతులకు శిక్షణ




**రుద్రవరం, ఆగస్టు 26, ప్రభాతవార్త :** మండలంలోని మందలూరు గ్రామంలో మంగళవారం ఆర్‌కెవివై పథకం క్రింత రైతుశిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సహాయ వ్యవసాయ సంచలకులు కె.చెన్నయ్య, వెంకటేశ్వరరెడ్డి, వ్యవసాయాధికారి, జిల్లా వనరుల కేంద్రం వారు హాజరయ్యారు. చెన్నయ్య మాట్లాడుతూ రైతులకు మినుము పంట, మొక్కజొన్నలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వరి పంటలో కలుపు యాజమాన్యం గురించి వివరించారు. వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పంటలలో డ్రోన్ ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి జి.సుమతి, విరణాధికారులు రాజు, వహీమా, రైతుసేవా సహాయకులు రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల డిమాండ్లకు గ్రీన్ సిగ్నల్?

**కోవెలకుంట్ల, ఆగస్టు 26, ప్రభాతవార్త :**



దివ్యాంగులు చేస్తున్న దర్నాలకు ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించింది. దివ్యాంగుల గొత్తు కోశారంటు గత కొన్ని రోజులుగా దివ్యాంగులు ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు. అయితే గత ప్రభుత్వం దివ్యాంగులు కాక పోయిన తక్కువ శాతము అంగవైకల్యాము ఉన్నా కూడా పించను 10000నుండి 15000ల వరకు అందించారు. అయితే నూతన ప్రభుత్వం ఇచ్చిన పిదప దివ్యాంగులకు గత కంటే రెండింత పించరు మంజూరు చేసింది.అయితే దివ్యాంగుల్లో చాలా మందికి అంగవైకల్యాము తక్కువ ఉన్న కూడా పించను మంజూరు చేశారంటు తెలుగు దేశం ప్రభుత్వం జిఓను జారీ చేసి రివెరిఫికేషన్ చేయాలని అదేశాలు జారీ చేసింది. దీనితో తక్కువ అంగవైకల్యాము ఉన్నవారందరికి పించన్ కట్ చేయాలని అదేశాలు అందాయి దీనితో దివ్యాంగులురోడ్డు ఎక్కారు. వీరి అభ్యర్థనను విన్న ప్రభుత్వం ఎట్టకేలకు దివ్యాంగులకు శుభవార్త చెప్పింది.దీనిపై కీలక నిర్ణయం తీసుకుంది.18 ఏళ్లలోపు మానసిక వైకల్యాము ఉన్న పిల్లలకు పించను కొనసాగుతుందని వెంటనే నోటీసులను నిలిపి వేయాలని అదేశాలు జారీ చేసింది.ఒక్కొక్కరికి రూ 6000 ప్రకారము పించను కొనసాగించాలని అదేశించింది. అలాగే 40 శాతము కంటే తక్కువ అంగవైకల్యాము ఉన్న 60ఏళ్లుపైబడిన వారికి వృద్దుల జాబితాలోకి మార్చి రూ 4000 పించను ఇవ్వాలని నిర్ణయించింది. అలాగే అర్హత ఉండి పించనే రద్దుఅయితే అప్పీలు చేసుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది. దీనితో నిజమైన దివ్యాంగులకు న్యాయం జరిగి నట్లు అయింది.

# సామాజిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభించాలి

– డీవైఎఫ్ఐ నాయకుల డిమాండ్

**ఆలూరు, ఆగస్టు26, ప్రభాతవార్త :**




ఆలూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు నూతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభించాలని డీవైఎఫ్ఐ ఆలూరు ప్రాంతీయ కన్వీనర్ మైన డిమాండ్ చేశారు. మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రి ముందు డీవైఎఫ్ఐ ప్రాతీయ అధ్యక్షులు గోవర్ధన్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గకేంద్రంలో రోగుల సౌకర్యార్థం సుమారు రూ.కోటి వెచ్చించి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని నాడు-నేడు పథకం కింద భవనం నిర్మించారన్నారు. భవన నిర్మాణం పూర్తి అయ్యి మూడేళ్లు గడుస్తోందని, నేటికీ ప్రారంభించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అలాగే లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ఎక్స్ రే యంత్రం కూడా సమకూర్చారని, కానీ రోగులకు అందుబాటులోకి రావడం లేదన్నారు. ఇప్పటికైనా వైద్యాధికారులు స్పందించి సామాజిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభించి, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ప్రజలతో కలిసి ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారికి వినతి పత్రం అందించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.పి.నారాయణస్వామి, సీఐటీయూ మండల నాయకులు కృష్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు విఠల్, ఉలిగప్పప, రంగనాథ్, మణి, శివరాజ్, మేఘశ్యాం, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లక్ష్మినారాయణ, అధ్యక్షులు బసవరాజు, నాయకులు సురేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

# మూడు రోజుల పాటే.. వినాయక ఉత్సవాలు..!

**గూడూరు, ఆగస్టు 26, ప్రభాతవార్త :**



గూడూరులో జరిగే శ్రీ వినాయక ఉత్సవాల కార్యక్రమాలను మూడు రోజుల పాటే నిర్వహించుకోవాలని ఎస్.ఐ చిరంజీవి తెలిపారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే శ్రీ వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఉత్సవాలను అన్ని వినాయక కమిటి ఉత్సవ నిర్వాహకులంతా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, ఎక్కడా కూడా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా చూసుకోవాలని సూచించారు. ఈ ఉత్సవాల ముగింపు రోజైన శుక్రవారం జరిగే శ్రీ వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించేదందుకు గట్టి పోలీసు బందోబస్తునున నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిమజ్జన కార్యక్రమాలను ఐదు రోజుల పాటు నిర్వహించుకుంటామని ఆయా కమిటీల నిర్వాహుకుల నుంచి వచ్చిన వినతులపై తాన జిల్లా ఎస్సీ దృష్టికి తీసుకుపోయామన్నారు. అయితే జిల్లాలో ఇది వరకు ఆయా ప్రాంతాలకు ఇచ్చిన ఆదేశాల ప్రకారమే నిర్వహించుకోవాలని, ఆ విధంగా జరిగే ఉత్సవాలకు పోలీసు బందో బస్సులను నిర్వహించుకోవాల్సి ఉంటుందన్నారు. కొత్త విధానల ద్వారా పోలీసు బందోబస్తులకు కష్టతరమతుందన్నారు. అందుకే ఇది వరకు ఉన్న పద్ధతి ప్రకారంగానే నిమజ్జన కార్యక్రమాలను సూచించుకోవాలని ఆయా వినాయక కమిటీల నిర్వాహకులకు తెలియజేశారు.

# గడ్డిమందు సేవించి యువకుడు ఆత్మహత్య

**మంత్రాలయం, ఆగస్టు 26, ప్రభాతవార్త :**



మండల పరిదిలోని మాధవరంగ్రామంలో గడ్డిమందు సేవించి ఓ యువకుడు మృతి చెందాడు,వివరాల మేరకు గ్రామానికి చెందిన లేట్ కురువ లక్ష్మన్న కుమారుడు కురువ వెంకట రమణ(23)అనే యువకుడు గతకొంత కాలంగా తీవ్రమైన కడుపు నోప్పితో బాథపడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అయితే సోమవారం అర్థరాత్రి మరోమారు కడుపు నొప్పి రావడంతో యువకుడు తమ ఇంటిలో గడ్డిమందును సేవించాడు.కుటుంబసభ్యులు గమనించేలోపు ముయకుడు తుదిశ్వాస విడిచినట్లు తెలిపారు.సమాచారం తెలుసుకున్న మాధవరం పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మాధవరం పోలీసులు తెలిపారు.

# కడివెల్ల గ్రామంలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్

: ఎమ్మిగనూరు డిఎస్పీ ఎం.ఎన్.భార్గవి

**ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 26, ప్రభాతవార్త :**



ఎమ్మిగనూరు మండలం కడీవెళ్ల గ్రామంలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణ లో భాగంగా ఎమ్మిగనూరు డిఎస్పీ ఎన్ఎం.భార్గవి ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పోలీసులు బృందాలుగా బయలు దేరి తెల్లవారుజామున కడివెళ్లే గ్రామంలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.మంగళవారం ఈ సందర్బంగా డి ఎస్పీ భార్గవి మాట్లాడుతూ కార్డన్ సెర్చ్ ఆపరేషన్ మండల పరిధి లోని కడివెళ్ల గ్రామంలో దాడులలో అనుమానితులు 9 మంది మాజీ ఖైదీల ఇళ్లను తనిఖీ ననిర్వహించారు.సరైన రికార్డులు,నంబర్ ప్లేట్ లేని 9 ద్విచక్రవాహానాలు స్వాధీనం చేసుకున్నారు.అలాగే కడివెళ్ల గ్రామానికి చెందిన బోయ కేసన్న ఇంటి నుండి 40 180ఎం.ఎల్ క్వార్టర్ బాటిళ్లు డిపిఎల్ ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఏవరైనా చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. ఈ కార్డన్ సెర్చ్ ఆపరేషన్ లు నిరంతరం కొనసాగుతుంటాయని పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్డన్ సెర్చ్ ఆపరేషన్ లో సి ఐ లు 4 గురు, ఎస్సైలు7 గురు,50 మంది పోలీసులు సబ్బంది పాల్గొన్నారు.

# సమన్వయకర్త అన్నారపు శేషిరెడ్డి

: మట్టి విగ్రహాలు కాలుష్యాన్ని నివారిస్తాయి-అన్నారపు శేషిరెడ్డి

**వెలుగోడు, ఆగస్టు 26, ప్రభాతవార్త :**




ప్రతి ఒక్కరు మట్టి విగ్రహాలను వాడితే వాతావరణ,నీటి కాలుష్యాన్ని నివారించవచ్చునని శ్రీశైల నియోజకవర్గ తెదేపా సమన్వయకర్త అన్నారపు శేషిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రధాన సెంటర్‌లో వెలుగోడు పట్టణ అర్యవైశ్యుల అధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అయన ముఖ్య అతిధిగా హాజరై విగ్రహాలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు తమ ఇంట్లో మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని అందరు ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. మట్టి వి గ్రహాలకు, రసాయనక పదార్థులు,రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల కలిగే నష్టాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహానంది దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యులు లాలం నాగార్జున, తెదేపా మండల అధ్యక్షులు ముల్లా అబ్దుల్ కలాం, వెలుగోడు సింగిల్ విండో చైర్మన్ మండ్ల శంకర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఖలీల్, వాసవీ క్లబ్ అధ్యక్షులు సంజీవరాయప్రసాద్, సాయి మెడికల్ యజమాని తెదేపా అర్యవైశ్య నాయకులు రాము రవి, మల్లికార్జున, ప్రవీణ్‌కుమార్, జనార్థన్,తదితరులు పాల్గొన్నారు.

# ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

– కృత్రిమ కొరత సృష్టిస్తే డీలర్ల లైసెన్సులు రద్దు – తహాశీల్దార్ రమాదేవి

**మహానంది, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే యూరియా అమ్మాలని ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహాశీల్దార రమాదేవి హెచ్చరించారు. మంగళవారం మహానంది మండలం గాజులపల్లెలో గఫారియా దీప్తీ ఫెర్టిలైజర్స్ అండ్ ఫెస్టిసైడ్స్ ఎరువులు, పురుగుమందుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ రాంమోహన్‌రెడ్డిలతో కలిసి తనిఖీచేశారు. అనంతరం రసాయనిక, ఎరువులు, పురుగుమందులకు సంబంధించి స్టాక్ రిజిష్టర్, బిల్లు బుక్కులు, గోడౌన్‌లు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈపాస్ మిషన్ బ్యాలెన్స్ గోడౌన్‌లో ఉన్న స్టాక్‌కు స్టాక్ రిజిష్టర్‌లో ఉన్న స్టాక్‌కు సమానంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో విఆర్వో జెజి బాబు, బసాపురం విఆర్వో వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు.



# డెంగ్యూ జ్వరంతో చిన్నారి మోక్షిత మృతి...తప్పెవరిది..!?

- వెల్దుర్తి పట్టణంలోని పలువార్డులలో పారిశుద్ధ్యలోపం..విజృంభిస్తున్న విషజ్వరాలు..
- వెల్దుర్తి సిహెచ్‌సిలో చేరిన వారిలో మలేరియా,టైఫాయిడ్,డెంగ్యూ జ్వరాల నిర్దారణ..
- చిన్నారి కుటుంబసభ్యులను పరామర్శించిన పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవితో నాయకులు..





**వెల్దుర్తి, ఆగస్టు26, ప్రభాతవార్త :** డెంగ్యూ జ్వరంతో కోలుకోలేక చిన్నారి మోక్షిత మృతి,తప్పెవరిదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.పట్టణంలోని పలువార్డులలో మురికికాల్వలు లేకపోవడమా,ఎక్కడ పడితే అక్కడ చెత్తచెదారం నిండిపోవడామా,మురికినీరు నిల్వఉండి దోమలు ప్రబలి జ్వరాలు రావడం కారణామా, పారిశుద్ధ్యలోపానికి కారణమైన అధికారులదా,రాత్రి వేళల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయించకపోవడం,నీటిని శుద్ధి చేయకపోవడం,మండల కేంద్రంలో మండల అధికారుల పర్యవేక్షణ లోపమా,జిల్లా అధికారులకే తెలియాలి.ఇప్పటికే వెల్దుర్తిలోని పలువార్డులలో ప్రజలు జ్వరాలతో అల్లాడుతున్నారు.వెల్దుర్తి సిహెచ్‌సిలో చేరిన వారిలో మలేరియా,టైఫాయిడ్,డెంగూ య్ జ్వరాల నిర్దారణతో వైద్యచికిత్సలు పొందుతున్న బాధితులు,ఎక్కువ మంది చిన్నారులే జ్వరం బారిన పడుతున్నారు.

వెల్దుర్తి పట్టణంలోని ఎస్సీ కాలనీలో నివాసముంటున్న సిపిఐ మండల కార్యదర్శి టి.క్రిష్ణ సునీత కుమార్తె చిన్నారి మోక్షిత(7) డెంగ్యూ జ్వరంతో అల్లాడుతూ మంగళవారం తెల్లవారుజామున కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందింది.కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు ఈ చిన్నారి జ్వరంతో బాధపడుతుంటే తల్లితండ్రులు ఈనెల21న వెల్దుర్తి సిహెచ్‌సిలో చేర్పించారు.అయితే డెంగ్యూ లక్షణాలు ఉన్నాయని,రక్తకణాలు తక్కువగా ఉన్నట్లు ఇక్కడి వైద్యులు గుర్తించి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని రెఫర్ చేశారు.కుటుంబసభ్యులు ఆ చిన్నారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.అక్కడి వైద్యులు వైద్యపరీక్షలు చేయించి చిన్నారికి డెంగ్యూ జ్వరం ఉన్నట్లు నిర్థారించారు. అయితే కోలుకోలేక చిన్నారి మృతిచెందింది.ఆ చిన్నారిని కుటుంబసభ్యులు తాము నివాసముంటున్న వెల్దుర్తికి తీసుకొచ్చారు.ఈ విషయం తెలుసుకున్న తెదేపా నాయకులు టి.ఇ.బలరాంగౌడ్,మాజీ ఎంపిపి యల్.ఇ.జ్ఞానేశ్వర్ గౌడ్, సిపిఐ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు,ప్రజాసంఘాల నాయకులు,వెల్దుర్తి మండల జర్నలిస్టులు,ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకులు ఆ చిన్నారి ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.తల్లితండ్రులకు తమ సంతాపం తెలియజేశారు.

**-చిన్నారి మోక్షిత మృతి బాధాకరం-పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి..**

డెంగ్యూ జ్వరంతో చిన్నారి మోక్షిత మృతిచెందడం బాధాకరమని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి అన్నారు.చిన్నారి మరణవార్త విన్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి మండల వైకాపా కన్వీనర్ బొమ్మనరవిరెడ్డి,జడ్పీటిసి సభ్యులు దాదిపోగు సుంకన్నతో కలిసి వారి ఇంటికి వెళ్లి చిన్నారి మృతదేహంపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.తల్లితండ్రులకు ఆమె ధైర్యం చెప్పారు.

# టీడీపీ సీనియర్ నేత నారాయణరెడ్డి ఔదార్యం

- జెడ్పీ ఉన్నత పాఠశాల నిర్మాణానికి భూమి విరాళంగా.. అందజేసిన నారాయణరెడ్డి
- అభినందించిన విద్యాశాఖ అధికారులు, గ్రామస్తులు
- పుట్టిన ఊరు అభివృద్ధికి కృషి చేస్తా : సి.నారాయణరెడ్డి

**ఆలూరు, ఆగస్టు26, ప్రభాతవార్త;** పుట్టి పెరిగిన సొంత గ్రామానికి మేలు చేయాలనే ఉద్దేశ్యంతో గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి టీడీపీ సీనియర్ నాయకుడు, తెలుగు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సి.నారాయణరెడ్డి తన సొంత భూమి నాలుగు ఎకరాలను విరాళంగా ఇస్తున్నట్లు మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష ప్రాజెక్ట్ డీఈఈ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆలూరు ఎంఈఓ-2 చిరంజీవిరెడ్డిలు స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే స్థలాన్ని స్కూలు పేరుమీదుగా రిజిస్టర్ చేసి విద్యాశాఖ అధికారులకు అప్పగిస్తామని నారాయణరెడ్డి తెలిపారు. గ్రామంలో హైస్కూల్ లేకపోవడం వల్ల పక్క గ్రామాలకు ఆడపిల్లలు వెళ్లాలంటే ఇబ్బందిగా మారుతుందని, అందుకే తనవంతుగా విద్యాభివృద్ధికి కృషి చేసేందుకు నాలుగు ఎకరాల భూమిని అందిస్తున్నట్లు తెలిపారు. పుట్టిన ఊరు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు సూచన మేరకు పీ4 కార్యక్రమంలో భాగంగా అనాథ వృద్ధురాలిని దత్తత తీసుకుని ఆలనాపాలనా చూస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ సేవాభావాన్ని కలిగి ఉండాలలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు, గ్రామ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, ప్రజలు ఆయనను అభినందించారు.



## అనధికారికంగా నివాసం ఉన్న వారిని ఖాళీ చేయించేందుకు చర్యలు




**కర్నూలు, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** కర్నూలు నగరం లోని ఎ, బి,సి క్యాంప్ క్వార్టర్స్ లో అనధికారికంగా నివాసం ఉన్న వారిని ఖాళీ చేయించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకట నారాయణమ్మ తెలిపారు. సోమవారం కలెక్టర్ లోని తన ఛాంబర్ లో ఆర్ అండ్ బి, మున్సిపల్, పోలీస్, విద్యుత్, రెవెన్యూ శాఖ అధికారులతో డీఆర్వో ఈ అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు ఏ, బి, సి క్యాంపుల్లో అనధికారికంగా నివాసం ఉన్న వారిని ఖాళీ చేయించేందుకు ఆర్ అండ్ బి, మున్సిపల్,పోలీస్, విద్యుత్, రెవెన్యూ శాఖ అధికారులతో మూడు టీములను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇంతకుమునుపే ఏ, బి, సి క్యాంపుల్లో ఆర్ అండ్ బి అధికారులు, తహసీల్దార్ల ద్వారా అనధికారికంగా నివాసం ఉన్నవారికి నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఆ నోటీసుల మేరకు వారు స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని, ఖాళీ చేయని పక్షంలో క్వార్టర్స్ కు విద్యుత్, నీటి సరఫరా తదితర సౌకర్యాలను బంద్ చేసి, సెప్టెంబర్ 8వ తేదీ నుంచి అనధికారికంగా నివాసం ఉన్న వారిని ఖాళీ చేయించేందుకు సమావేశంలో నిర్ణయించినట్లు డిఆర్వో తెలిపారు.. సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ ఈ మహేశ్వర్ రెడ్డి, ఏవో శివరాముడు, పోలీస్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సబ్ జైల్‌ను తనిఖీ చేసిన జడ్జి




**నందికొట్కూరు, ఆగస్టు 26, ప్రభాతవార్త:** పట్టణంలోని ఉపకారాగారాన్ని(సబ్‌జైల్)జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి బి.లీలావతి వెంకటేశాద్రి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ముద్దాయిలతో మాట్లాడుతు ఎంత కాలం నుండి ఉన్నారు. ఏఏ కేసులలో వచ్చారని, అలాగే మీకు ఇక్కడ అన్ని వసతు,భోజన సదుపాయం,వైద్య సేవలు ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. కారాగారంలోని ఉచిత న్యాయ సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థిక స్థోమత లేని వారికి ఉచిత న్యాయవాది ద్వారా ఏదైన సమస్య ఉంటే స్థానిక మండల న్యాయసేవా సంఘం ద్వారా గానీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లేదా ఆన్‌లైన్ 15100 ద్వారా గానీ తెలుసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరిండెంట్ కె.రఘునాథ్‌రెడ్డి, ప్యానల్ న్యాయవాది ఎస్.మద్దయ్య, మెడికల్ ఆఫీసర్ డా.ప్రవీణ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## నారాయణ పాఠశాలలో వినాయకచవితి సంబరాలు



**కర్నూలు విద్య, ఆగస్టు 26, ప్రభాతవార్త:** పార్వతి పరమేశ్వరుల కుమారుడైన వినాయకుడి పుట్టిన రోజును భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలుచేస్తారని స్కూల్ ఏజిఎం అన్వర్ బాష తెలిపారు. వినాయకచవితిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక మాధవనగర్‌లోని నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ మహ్మద్ అల్తాఫ్ అధ్యక్షతన వినాయకునికి ఘనంగా పూజలు నిర్వహించారు. వేడుకలకు స్కూల్ ఏజిఎం ముఖ్య అతిథిగా హాజరయి వినాయకచవితి పండుగ విశిష్టతను వివరించారు. గణేషుడు జ్ఞానానికి విజయానికి అధిపతిగా విద్యార్థులు భావిస్తారని అందుకే పండుగను శ్రేయస్సు సంపద కోసం జరుపుకుంటారన్నారు. ప్రతి ఇంటికి వినాయకుడి విగ్రహాన్ని తీసుకువచ్చి పసుపు, కుంకుమ, పూలు, అంక్షితలు పండ్లు మరియు ఉండ్రాళ్లు వంటి పూజా సామాగ్రి సమర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరీ, రాధ పాల్గొన్నారు.

# సబ్ డివిజన్ పరిధిలో వినాయచవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోండి

: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినమైన చర్యలు తప్పవు
: 3 రోజుల పాటు జరిగే వినాయక ఉత్సవాలను సంప్రదాయంగా జరుపుకుందాం
: వినాయక మండపాల దగ్గర కమిటి నిర్వహకులే బాధ్యతగా వ్యవహరించాలి
ఆత్మకూరు డిఎస్పీ ఆర్.రామాంజి నాయక్



**ఆత్మకూరు, ఆగస్టు26, ప్రభాతవార్త:** ఆత్మకూరు పోలీసు సబ్ డివిజన్ పరిధిలో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆత్మకూరు డిఎస్పీ రామాంజి నాయక్ తెలిపారు. మంగళవారం సబ్ డివిజన్ పరిధిలో పోలీసుల పర్యవేక్షణ వినాయక మండపాలపై పర్యవేక్షణ తీరు పండుగ వాతవరణంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వివరించారు. పోలీసులు ఇచ్చిన అనుమతులతో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకున్న మండపాల దగ్గర సమయపాలన పాటించి భక్తి శ్రద్దలతో పండుగను శాంతి యుతంగా జరుపుకోవాలని తెలియజేశారు. ప్రజలకు, భక్తులకు వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కమిటి సభ్యులే చొరవ తీసుకోవాలని వివరించారు. ఆత్మకూరు ప్రాంతంలో 3రోజుల పాటు వినాయక ఉత్సవాల ఏర్పాట్లను సబ్ డివిజన్ పరిధిలో వివరాలను వెల్లడించారు. ఆత్మకూరు 39, పాములపాడు 41, వెలుగోడు 32, నందికొట్కూరు 37, జూపాడుబంగ్లా 22, బ్రహ్మణకొట్కూరు 25, ముచ్చుమర్రి 10, శ్రీశైలం అర్బన్ 22, శ్రీశైలం టు టౌన్ 37, కొత్తపల్లి మండలాలతో పాటు మొత్తం 275కు పైగా వినాయక విగ్రహాలను భక్తాదులు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంతాలలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా శాంతి భద్రతలకు విఘాతం కల్పించకుండా కమిటి సభ్యులు వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించుకోవాలని తెలిపారు. ఆత్మకూరు పోలీసు సబ్ డివిజనల్ పరిధిలో ప్రజలకు పోలీసు ఉన్నతాధికారులకు వినాయక పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

# అక్రమంగా తరలుతున్న ఎరువులు పట్టివేత-ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌రావు

- వ్యవసాయ శాఖ అధికారులకు అప్పగింత
- కేసు నమోద్ చేసిన అధికారులు



**మంత్రాలయం, ఆగస్టు, 26, ప్రభాతవార్త** మండల పరిదిలోని మాధవరం చెక్ పోస్ట్ వద్ద అక్రమంగా తరలుతున్న ఎరువులను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌రావు,మండల వ్యవసాయాధికారి జీరా గణేష్‌లు మంగళవారం విలేకరులకు తెలిపారు.వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రానికి చెందిన శంకరప్ప గౌడ్ అనే వ్యక్తి ఓ బొలెరో వాహనంలో 5.175 మెట్రిక్ టన్నుల యూరియా,డి ఏ పి ,10:26:26,19:19:19 తదితర ఎరువులను అక్రమంగా తరలిస్తున్నట్లు రాబడిన సమాచారం మేరకు వాహనాన్ని పట్టుకున్నామన్నారు.ఇందులో సుమారు రూ.1.25 లక్షల ఎరువులు ఉన్నట్లు గుర్తించామన్నారు.వ్యవసాయశాఖ అధికారులు వాహనాన్ని స్వాదీనం చేసుకొన్ని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.ఎరువులు అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఇవో తిరుమల్‌రెడ్డి,ఏఏ విజయ్,గ్రామ సేవకుడు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బాలో కలత... వార్తకు స్పందించిన డీఈఓ

- జిల్లా అధికారులను విచారణకు పంపించిన డీఈఓ.
- కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసిన జిల్లాధికారులు, ఆర్డీఓ, తహసీల్దార్



**మద్దికెర, ఆగస్టు26, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన మద్దికెరలోని కస్తూర్బా పాఠశాలలో ఆహారం సరిగా పెట్టడం లేదంటూ విద్యార్థినీలు వీడియో విడుదల చేయడంతో సోమవారం కస్తూర్బాలో కలత అనే శీర్షికన వార్తా కథనం ప్రచురితమయ్యింది. ఇందుకు స్పందించిన జిల్లా డీఈఓ శామ్యూల్‌పాల్ తక్షణమే కమిటీని నియమించి మంగళవారం స్కూల్‌కు పంపించారు. అలాగే ఆర్డీఓ భరత్‌నాయక్, తహసీల్దార్ గుండాలనాయక్ పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా అధికారులు పంపిన కమిటీకి నిర్భయంగా విద్యార్థినీలు, వారి తల్లిదండ్రులు సమస్యలు తెలియజేయాలన్నారు. స్కూల్ ఛైర్మన్ లక్ష్మీదేవి మాట్లాడుతూ ప్రిన్సిపాల్ స్కూల్‌లోకి రానివ్వకుండా పదేపదే కులంతో దూషిస్తుందని లిఖితపూర్వకంగా విచారణ కమిటీకి తెలియజేశామన్నారు. విచారణ కమిటీ వస్తుందని ప్రిన్సిపాల్ ముందుగానే తెలుసుకుని వారికి అనుకూలమైనటువంటి పిల్లల తల్లిదండ్రులను స్కూల్‌లోకి పిలుచుకోవడం జరిగింది. ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా చేశారన్నారు.

# వెల్దుర్తి సిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా అధికారులు



- ఎంపిడిఓ కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం..

**వెల్దుర్తి, ఆగస్టు26, ప్రభాతవార్త** మండల కేంద్రమైన వెల్దుర్తిలో చిన్నారి మోక్షిత(7) డెంగ్యూ జ్వరంతో మంగళవారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించిన విషయం తెలిసిందే.ఈ విషయం తెలుసుకున్న జిల్లా అధికారులు వెల్దుర్తికి చేరుకొని చిన్నారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి స్థానిక సిహెచ్‌సిని ఆకస్మిక తనిఖీలు చేశారు.డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్.శాంతికళ,కర్నూలు ఆర్డీఓ సందిప్‌కుమార్,డిపిఓ భాస్కర్ వైద్యశాలలో రోగులను పరామర్శించి వారి వివరాలను వైద్యులు డాక్టర్.సోమశంకర వరప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది ఏయే రోగాలతో ఆసుపత్రిలో చేరారని ఆరా తీశారు.వారికి ఏ విధమైన వైద్యసేవలు అందిస్తున్నారని ప్రశ్నించారు.ఆసుపత్రిలో మౌలిక వసతులపై ఆమె ప్రశ్నించగా జనరేటర్ లేదని,స్టాఫ్ కొరత ఉందని గుర్తించారు.కాన్పు అయ్యాక బాలింతలను వరండాలో ఉంచడం పాత్రికేయుల ద్వారా తెలుసుకొని తగు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తామన్నారు.తాము జిల్లాకలెక్టర్ రంజిత్‌బాష ఆదేశాల మేరకు వచ్చామన్నారు.30 పడకల ఆసుపత్రిలో ఓపి భారీగా పెరుగుతుందని ఇందుకు సంబంధించి వసతులు కావాలని తెలుసుకున్నారు.ఎక్స్ రే త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు.మందుల కొరత ఉందని ఆమె తెలుసుకొని ఫార్మాసిస్టును అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఎంపిడిఓ కార్యాలయంలో వారు డిఎల్‌పిఓ లక్ష్మి,తహశీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, ఎంపిడిఓ సుహాసినమ్మ,డిప్యూటీ ఎంపిడిఓ రవికిశోర్,ఆర్‌డబ్ల్యూయస్ ఏఇ మునెయ్య,ఇఓ లక్ష్మీనాథ్, వైద్యసిబ్బంది,గ్రామపంచాయతీ కార్యదర్శులు, వాటర్‌మెన్లు,గ్రామపంచాయతీ మేస్త్రీ, ఆరోగ్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు.మండల కేంద్రమైన వెల్దుర్తిలో పారిశుద్ధ్యలోపం ఎక్కువగా ఉందని తాము వార్డులలో స్వయంగా తిరిగి గుర్తించామన్నారు.నాయకుల మధ్య వివాదాలు ఉంటాయని అవి అధికారులకు అవసరం లేదని ఇఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆసుపత్రి సమీపంలో ప్రధాన రహదారి ప్రక్కన కుంటలో ఉన్న మురికినీరు శుభ్రం చేయించాలన్నారు.ఇంకా పలువార్డులలో మురికి నీరు రోడ ్లపై ప్రవహిస్తుందని వాటిని తొలగించాలని ఆదేశించారు.దోమలు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఎప్పటికప్పుడు మురిక కాల్వలు శుభ్రం చేయించాలన్నారు.త్రాగునీటిని శుద్ధి చేయాలన్నారు.మండల అధికారులు ఒక టీంగా ఏర్పడి గ్రామంలోని అన్ని వార్డులలో తిరిగి సమస్యలను పరిష్కరించాలన్నారు. పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహారిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## హత్య కేసులో రౌడీ షీటర్‌కు జీవిత ఖైదు



**కర్నూలు, ఆగస్టు 26, ప్రభాతవార్త :** కర్నూలు జిల్లా, ఓర్వకల్లు పోలీసు స్టేషన్ పరిధిలో నన్నూరు గ్రామం నివాసి రౌడీ షీటర్ బోయ తోట శివ అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవరు ఆజంఖాన్ పైన దౌర్జన్యం చేయడంతో అతను తనకు ఎదురు చెప్పినాడనే కోపంతో, రౌడీ షీటర్ బోయ తోట శివ 19.11.2017న జామియా మసీదు వద్ద టీ హోటల్ లో ఉన్న అజంఖాన్ పైన కత్తితో దాడి చేసి , దారుణంగా పొడిచి హత్య చేయడం జరిగినది. ఫిర్యాదు మేరకు అప్పటి యస్.ఐ. ప్రస్తుత కర్నూల్ రూరల్ సీఐ చంద్ర బాబు నాయుడు కేసు నమోదు చేశారు. ఆ మేరకు చార్జ్ షీట్ వేశారు. కర్నూలు జిల్లా ప్రధాన న్యాయస్థానం యందు సాక్షులు విచారణ జరిగిన పిదప జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి ముద్దాయి బోయతోట శివ పై నేరం ఋజువు కావడంతో సదరు ముద్దాయికి జీవితఖైదు శిక్ష మరియు రూ. 5000/ జరిమానా విధించడం జరిగినది.

## ఎరువుల దుకాణాల్లో తనిఖీలు.

: మొత్తం విలువ రూ.53,275 సిజ్



**ఎమ్మిగనూరు. ఆగష్టు 26, ప్రభాతవార్త:** ఎమ్మిగనూరు పట్టణంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ట్రేడర్స్ లో ఏడి మహమ్మద్ ఖాద్రి, మండల వ్యవసాయ అధికారి శివ శంకర్లు మంగళవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నందవరం మండల పరిధిలోని రైతుల పేరు మీద బిల్లులు వేసి కర్ణాటక సరిహద్దుకు అక్రమంగా ఎరువులను తరలించడం జరిగిందిని అందులో భాగంగా మొత్తం 3 మెట్రిక్ టన్నులు (63 బస్తాలు) మొత్తం విలువ రూ.53275/ స్టాక్ మొత్తని సీజ్ చేసి 6తి కేసు ఫైల్ చేయడం జరిగింద న్నారు. దాడులో భాగంగా తినివీ నరసింహుడు. తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యానపంటల సాగుకు రైతులు ముందుకు రావాలి



**నంద్యాల టెక్కె, 26 ఆగస్టు, ప్రభాతవార్త:** ఉద్యానపంటల సాగుకు రైతులు ముందుకు రావాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యనారాయణ రైతులను కోరారు. నంద్యాల మండలంలోని బ్రాహ్మణపల్లె, పాండురంగాపురం గ్రామాలలో మంగళవారం రైతులు సాగు చేసిన పండ్ల తోటలను పరిశీలించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పీడీ సూర్యనారాయణ మాట్లాడుతూ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పండ్ల, పూల తోటల సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొక్కలు నాటి నుండి పంట చేతికొచ్చే వరకు ఉద్యానవన శాఖ అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది ఇచ్చే సలహాలు, సూచనలు పాటించడం దా ్వరా అధిక దిగుబడితో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధిహామీ పథకం ఏపీఓ గణేష్, ఈసీ అశోక్, టీఏలు సుబ్బరాయుడు, ఫకృద్దీన్, ఫీల్డ్ అసిస్టెంట్ జాన్సన్, రైతులు పాల్గొన్నారు.

## భార్య భర్తను చంపిందా..!?

- కోడలిపై పోలీస్‌స్టేషన్‌లో అత్త ఫిర్యాదు
- అగ్రహారంలో అనుమానస్పదంగా వ్యక్తి మృతి



**మద్దికెర, ఆగస్టు26, ప్రభాతవార్త,** మండలంలోని అగ్రహారం గ్రామంలో అనుమానస్పదంగా కాలిన గాయాలతో వెంకటేశ్వర్లు అనే వ్యక్తి మృతిచెందాడు. కాలిన గాయాలతో గత కొద్ది రోజుల క్రితమే కొడుకు మృతిచెందడం, సోమవారం కోడలు, మనవరాలు ఊరు వదిలి పరారీ కావడంతో అత్త కోడలిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్, ఎస్ఐ విజయ్‌నాయక్‌లు దర్యాప్తు చేపట్టారు. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.